ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది:25.08.2026 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణను మాదకద్రవ్య రహితంగా మార్చే నశాముక్త సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం అత్యంత కీలకమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు.

2. తెలంగాణ శాసనసభ సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు.

3. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు చేపట్టిన నిరాహార దీక్ష రెండో రోజుకు చేరింది.

4. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారానికి ఎన్డీఎస్ఏ అఫిడవిట్ , సిడబ్ల్యూపిఆర్ఎస్ నివేదికలు ఎదురుదెబ్బని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు

---------------------------------

**గవర్నర్**

నశాముక్త సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. మంగళవారం నిజామాబాద్‌లోని భూమారెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్య , క్రీడలు, దేశసేవ వైపు యువత పయనించాలని సూచించారు. EAGLE కార్యక్రమం ద్వారా డ్రగ్స్ నియంత్రణకు తెలంగాణ పోలీసులు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అరవింద్‌తో

కలిసి లక్ష మంది సంతకాల ఫ్లెక్సీని ఆవిష్కరించి , విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**పీటీసీ - నిజామాబాద్**

---------------------------------

**శాసనసభ సమావేశాలు**

తెలంగాణ శాసనసభ సమావేశాలు సెప్టెంబర్ 7న ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులు , ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. నియోజకవర్గాల అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించిన ఆయన, తమ ప్రాంతాల్లోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని శాసనసభ్యులను ఆదేశించారు. భూసేకరణ పూర్తి కాకపోతే ప్రాజెక్టులు ఎప్పటికీ పూర్తికావని సిఎం హెచ్చరించారు. భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతుల కోసం ప్రభుత్వం అవసరమైన నిధులను విడుదల చేస్తుందని హామీ ఇస్తూ , ప్రజాప్రతినిధులు నియోజకవర్గ అభివృద్ధిపై మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, విప్‌లు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**డెస్క్**

----------------------------

**భట్టి విక్రమార్క**

సింగరేణిని కాపాడుకుంటూ లాభాల బాటలో నడిపించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బొగ్గుకే పరిమితం కాకుండా లిథియం , బంగారం వంటి కీలక ఖనిజాల మైనింగ్‌పై దృష్టి పెడతామన్నారు. కొత్త బొగ్గు బ్లాకుల సాధనకు కృషి చేస్తున్న డిప్యూటీ సీఎంను సచివాలయంలో సింగరేణి యూనియన్ నాయకులు నిన్న సన్మానించారు. సంస్థ విస్తరణకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

డెస్క్

-------------------------------

**ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

గ్రామ, వార్డు సభల నిర్వహణ, ఓటర్ల జాబితా సవరణలపై తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లాల ఎన్నికల అధికారులతో నిన్న వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సభల్లో ఏఎస్‌డీడీ ఓటర్ల వివరాలు చదివి వినిపించాలని , అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. లోపాలున్న ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని, వారానికోసారి రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.

డెస్క్

--------------------------------

**సీతక్క**

సచివాలయంలో గ్రామీణాభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క సమీక్షా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో కమిషనర్ దివ్య , స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మితో పాటు జిల్లాల సీఈఓలు , డిఆర్‌డిఓలు హాజరైయ్యారు. ఉపాధి హామీ పనులు , పంట కుంటల నిర్మాణం, మహిళా సంఘ భవనాల నిర్మాణం, నూతన చేయూత పింఛన్ల మంజూరు పురోగతిపై అధికారులతో మంత్రి విస్తృతంగా చర్చిస్తున్నారు.

డెస్క్

-------------------------------

**పొన్నం ప్రభాకర్**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం సర్వాయిపేటలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ టూరిజం ప్రాజెక్ట్ పనులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. విగ్రహ ఏర్పాటు , మ్యూజియం, గార్డెనింగ్, సౌందర్యీకరణ పనులను నాణ్యతతో వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి

చేస్తున్నామని, ఆయన చేతుల మీదుగానే త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించేలా దీనిని తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు.

డెస్క్

-------------------------------------

**ఉన్నతస్థాయి కమిటీ**

స్కిల్ వర్సిటీలో పాలిటెక్నిక్ కాలేజీల విలీనంపై కె.కేశవరావు అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సభ్యులుగా కోదండరామ్ , శాంతాసిన్హా, నవీన్‌మిత్తల్, శక్తి శాఖ కార్యదర్శిలు ఉండనున్నారు. ఉన్నతస్థాయి కమిటీలో సభ్యులుగా సాంకేతిక విద్య కమిషనర్‌కు చోటు కల్పించింది. పాలిటెక్నిక్ విద్యార్థులు , ఉద్యోగులు ఆందోళనలపై నివేదిక ఇవ్వాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. అందరితో చర్చించి 30రోజుల్లో నివేదిక ఇవ్వాలని కమిటీకి సూచించింది.

డెస్క్

------------------------------

**టీపీసీసీ చీఫ్**

ఈనెల 27న జరిగే ఓటర్ గ్రామ/వార్డు సభలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నేతలతో అత్యవసర జూమ్ సమీక్ష నిర్వహించారు. ప్రతి అర్హత కలిగిన ఓటును పరిశీలించాలని , కాంగ్రెస్ ఓట్ల తొలగింపు కుట్రలను తిప్పికొడుతూ ఒక్క ఓటు కూడా నష్టపోకుండా జాగ్రత్తపడాలని నాయకులకు సూచించారు. బీహార్ , బెంగాల్‌లలో సర్ ప్రక్రియ పరిణామాలను గుర్తు చేస్తూ , బిఎల్ఏలు సమగ్ర డేటాతో పాల్గొనాలని , నాయకులు ఎలాంటి అలసత్వం వహించకూడదని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ , ఇతర ప్రముఖ నేతలు పాల్గొన్నారు.

డెస్క్

---------------------------------

**రాంచందర్ రావు**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్. రాంచందర్ రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్ష రెండో రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు.

**బైట్ – ఈటల రాజేందర్**

ప్రైవేట్ కాలేజీల్లో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు హాల్ టిక్కెట్లు రాక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు , విద్యార్థులు పాల్గొన్న ఈ దీక్షను ఇవాళ మధ్యాహ్నం ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ హాజరై విరమింపజేయనున్నారు.

**పీటీసీ - హైదరాబాద్**

--------------------------------

**హరీష్ రావు**

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారానికి ఎన్డీఎస్ఏ అఫిడవిట్ , సిడబ్ల్యూపిఆర్ఎస్ నివేదికలు ఎదురుదెబ్బని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. అన్నారం , సుందిళ్లలో కాంక్రీట్ నాణ్యత బాగుందని , నీటిని ఎత్తుకోవచ్చని స్పష్టమైనా ప్రభుత్వం నిర్లక్ష్యంతో నీటిని ఏపీకి వదిలేసి తెలంగాణ రైతులకు నష్టం చేసిందన్నారు. రాష్ట్రంలో నీటి నిల్వలు 35.6 శాతానికే పరిమితమవ్వడం కాంగ్రెస్ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వం రాజకీయ కక్షలు పక్కనపెట్టి వెంటనే మోటార్లు ఆన్ చేసి గోదావరి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు.

**డెస్క్**

--------------------------------------

**ఓటర్ల విచారణ**

ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్ల విచారణ ప్రక్రియ ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 20 వరకు జరగనుంది. నోటీసుల ప్రింటింగ్ ఆగస్టు 31 నాటికి పూర్తవుతుంది.

అర్హులైన ఏ ఒక్కరి ఓటూ తొలగించకుండా గ్రామ , వార్డు సభల ద్వారా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విచారణకు 48 గంటల ముందు బీఎల్‌వోలు స్లిప్‌లను పంపిణీ చేసి , పూర్తి వివరాలను ఓటర్లకు వివరించాలి. ఓటర్లు తమ ధ్రువపత్రాలను ఓటరు పోర్టల్ , బీఎల్‌వో యాప్ లేదా విచారణ సమయంలో నేరుగా సమర్పించే వెసులుబాటును సీఈవో కార్యాలయం కల్పించింది.

డెస్క్

**ఇందిరమ్మ ఇండ్లు టవర్స్**

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందని , ఆగస్టు 25 సాయంత్రం నాటికి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో వెల్లడిస్తామని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ విపి గౌతం తెలిపారు. 16 నియోజకవర్గాల నుంచి వచ్చిన 60,720 దరఖాస్తులలో ప్రాథమికంగా అనర్హులైన వారి అభ్యంతరాలను పరిశీలిస్తున్నారు. వ్యక్తిగత ఫోర్ వీలర్స్ ఉన్నవారిని తోసిపుచ్చామని, క్యాబ్ డ్రైవర్లను అర్హులుగా గుర్తిస్తున్నామని చెప్పారు.

డెస్క్

వన మహోత్సవం

తెలంగాణ వ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమాలను వివిధ ప్రభుత్వ శాఖలు , స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు మొక్కలు నాటి , పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కానుకగా అందించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

డెస్క్

**నల్లగొండ కలెక్టర్**

బ్యాంకు కార్యకలాపాలపై ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. కలెక్టరేట్‌లో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన గోడపత్రికను చంద్రశేఖర్ ఆవిష్కరించారు. జిల్లాలోని 9 ఆర్థిక

అక్షరాస్యత కేంద్రాల ద్వారా గ్రామాల్లో ఉచితంగా అవగాహన కల్పిస్తారని  , ప్రజలు బ్యాంకింగ్ సేవలు,  రుణాలు,  ప్రభుత్వ పథకాల వివరాల కోసం వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**పీటీసీ - నల్గొండ**

**రాజన్న సిరిసిల్ల జిల్లా డీఎస్పీ**

మత సామరస్యంతో పండుగలు జరుపుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా  సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి పిలుపునిచ్చారు. రేపు మిలాద్ ఉల్ నబి పండుగ నేపథ్యంలో సిరిసిల్ల డీఎస్పీ కార్యాలయంలో మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. పండుగలు శాంతియుతంగా , సోదరభావంతో జరుపుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

**వనపర్తి కలెక్టర్**

భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం వనపర్తి మండలం సవాయిగూడెం గ్రామంలోని అటవీ శాఖ ప్రకృతివనంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొని మొక్కలు నాటారు.

**పీటీసీ - వనపర్తి**

**కవ్వంపల్లి సత్యనారాయణ**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటడం ద్వారా మానకొండూర్ నియోజకవర్గంలో వన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు.

**పీటీసీ - కరీంనగర్**

**భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్**

వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. ఇల్లందు క్రాస్‌రోడ్‌లోని సెంట్రల్ పార్క్ లో జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, మేయర్ మూడ్ గణేష్, విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు.

**పీటీసీ – భద్రాద్రి కొత్తగూడెం**

**ఐపీఎస్ హోదా**

తెలంగాణ పోలీసు శాఖకు చెందిన ఏడుగురు నాన్-క్యాడర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) అధికారులకు కేంద్ర హోంశాఖ ఐపీఎస్ హోదా కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పులిగిల్ల రవీందర్ , బి. శ్రీ బాలదేవి , జి. అరవింద్ , బాబురాజ మహేంద్ర నాయక్ , సాయిశ్రీ, పూజ, కరుణాకర్‌లు ఈ పదోన్నతి పొందారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలు , వారి పనితీరును పరిశీలించిన అనంతరం కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. హోదా లభించిన అధికారులకు త్వరలోనే కొత్త పోస్టింగ్‌లు కేటాయించనున్నారు.

**డెస్క్**

**ఎన్పీఎస్ అదాలత్**

నేషనల్ పెన్షన్ సిస్టమ్ చందాదారుల ఫిర్యాదుల పరిష్కారం కోసం సెప్టెంబర్ 2 , 2026న ఎన్‌పీఎస్ అదాలత్ నిర్వహించనున్నట్లు తపాలా శాఖ తెలంగాణ సర్కిల్ జనరల్ మేనేజర్ కార్యాలయం వెల్లడించింది. బాధితులు తమ ఫిర్యాదులను పూర్తి వివరాలతో ఆగస్టు 26 , 2026 లోగా సమర్పించాల్సి ఉంటుంది.

**డెస్క్**

**బీపీ మండల్ జయంతి**

ఆసిఫాబాద్ జిల్లావ్యాప్తంగా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బిపి మండల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బిపి మండల్ బీసీల సంక్షేమానికి , రిజర్వేషన్ల

సాధనకు ఎంతో కృషి చేశారని , బీసీలు రాజకీయంగా ఎదిగినప్పుడే అభివృద్ధి సాధ్యమని నాయకులు పేర్కొన్నారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**